క్లుప్తంగా

జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా నాగేశ్వరరావు



కారెంపూడి: పల్నాడు జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా కారెంపూడికి చెందిన బొంకూరి నాగేశ్వరరావు నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం నాగేశ్వరరావుకు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకుడు బొమ్మిన అల్లయ్య, బీసీ నాయకులు సూరె శ్రీనివాసరావు, సూరె చెంచారావు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు ప్రభుత్వ విప్ పీఆర్కేను ఘనంగా సన్మానించారు.

14న ఆత్మీయ సమావేశం



పిడుగురాళ్ల: హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న గురజాల నియోజకవర్గ ప్రజల కోసం ఈ నెల 14వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశం మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో గల నరేన్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఆయన సూచించారు.

ఎస్సీలను మోసం చేసిన షర్మిల

పార్టీ పదవులకు రాజీనామా చేసిన ఫ్యూజన్

దాచేపల్లి : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఎస్సీలను మోసం చేసిందని ఆ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.ఫ్యూజన్ ఆరోపించారు. ఈ మేరకు పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి తాను రాజీనామా చేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీల మనోభావాలను దెబ్బతీసేలా షర్మిల వ్యవహరిస్తుందని, ఎస్సీలకు అసలు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యత లేకుండా షర్మిల చేస్తుందని ఆయన మండిపడ్డారు. ఎస్సీలను మోసం చేసిన కాంగ్రెస్‌కి, రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకి రాజకీయంగా పుట్టగతులుండవని ఆయన ధ్వజమెత్తారు.

మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలి

నగర పంచాయతీ వైస్ చైర్మన్ బడేజానీ

గురజాల : ఈనెల 10వ తేదీన పిడుగురాళ్లలో జరుగు సిద్ధం సభను విజయవంతం చేయాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ కోరారు. ఆయన తన కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధం సభలో ముస్లిం సోదరులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ముస్లిం మైనార్టీ మండల నాయకుడు షేక్ నాగులుమీరా, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, మీర్‌సా, వలి తదితరులున్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

గురజాల : పింఛన్‌దారులకు పెన్షన్ సొమ్ము అందకుండా చంద్రబాబునాయుడు వేసిన ఎత్తులు ఫలించలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లకుండా ఎన్నికల సంఘం (ఈసీ) ద్వారా నిలువరించారు. దీంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము కోసం మండుటెండల్లో సచివాలయాలకు వెళ్లాల్సివచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబునాయుడు ఎత్తుగడను, పింఛన్‌దారుల ఇబ్బందులను గుర్తించి పింఛన్ పంపిణీలో జాప్యం జరగకుండా సత్వర చర్యలు చేపట్టింది. సచివాలయాల్లో వీరికి పింఛన్ సొమ్ము వెంటనే అందేలా చర్యలు చేపట్టారు. పింఛన్‌దారులకు సచివాలయాల వద్ద షామీయానాలు, కుర్చీలు, మంచినీరు వంటివి సమకూర్చి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోలేని వృద్ధులు, వికలాంగులు అనారోగ్యంతో మంచాన పడిన వారికి వారి ఇళ్ల వద్దే పింఛన్ డబ్బులు అందించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాంటి వారిని గుర్తించి సచివాలయాల సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు.

చెట్టును ఢీకొట్టిన కారు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ పాఠశాల సమీపంలో కారు చెట్టును ఢీకొన్న ఘటన ఆదివారం తెల్లవారు జామున జరిగింది. నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న కారు మార్జిన్‌లోని చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి సురక్షితంగా బయటపడ్డట్లు సమాచారం.

కాపు సోదరులు నా కుటుంబ సభ్యులు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి : కాపు సోదరులతో కాసు కుటుంబానికి ఎన్నో ఏళ్లుగా సత్సంబంధాలు ఉన్నాయని, కాపు సోదరులు నా కుటుంబ సభ్యులని గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీకి చెందిన టీడీపీ, జనసేనలకు చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మాజీ వార్డు సభ్యుడు బొమ్మిరెడ్డి నరసింహారావు, నాయకులు బొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, బొమ్మిరెడ్డి రాము, బొమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు, బొమ్మిరెడ్డి నరసింహారావు, జగ్గా శ్రీను, నాదెండ్ల సుబ్బారావు, కొప్పుల సుబ్బారావు, జగ్గా శివయ్య, మునగా హరీష్, శిగిరిపాటి కొండ, బండి కృష్ణలను స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాసు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ కాపులు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాసు కుటుంబం కృషి చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి కాపులు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని, కాపులకు సముచిత స్థానం కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన చెప్పారు. కాపు సోదరులలోని బొమ్మిరెడ్డి కుటుంబ సభ్యులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తామని, అందరం కలిసికట్టుగా కుంటంబం ఉందామని ఎమ్మెల్యే కాసు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గం రూపురేఖలు మారుస్తానని ఆయన చెప్పారు.

కాపులను నట్టేట ముంచింది టీడీపీ, జనసేన: బొమ్మిరెడ్డి నరసింహారావు

కాపులను అడుగడుగున మోసం చేసి నట్టేట ముంచిన పార్టీలు జనసేన, టీడీపీలు అని వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ వార్డు సభ్యుడు బొమ్మిరెడ్డి నరసింహారావు ధ్వజమెత్తారు. కాపులపాలిట దేవుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, కాపులకు అండగా నిలిచిన జగనన్నని మరోసారి సీఎం చేసే బాధ్యత కాపులమైన మేము తీసుకుంటామని ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలు మన ఇంటికే వస్తున్నాయని, మన కర్మకాలి టీడీపీ, జనసేనలు అధికారంలోకి వస్తే మనకి వచ్చే పథకాలు, డబ్బులు వాళ్ల ఇంటికే వెళ్తాయని, కాపు సోదరులు ఒక్కసారి పునరాలోచన చేసి మన అభివృద్ధికి అండగా ఉన్న వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నరసింహారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పార్టీ మాజీ పట్టణ కన్వీనర్ మునగా పున్నారావు, పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న బొమ్మిరెడ్డి నరసింహారావు

ముస్లింలకు అండగా ఉన్నాం

ముస్లిం, మైనార్టీలకు అండగా నిలిచామని, వచ్చే ఎన్నికల్లో ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక జలగల బజార్‌లో, షాదీఖానాలో ఇఫ్తార్ విందును ఆదివారం రాత్రి ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాసు మర్కస్ మసీద్‌లో జరిగిన ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. మక్కా నుంచి తీసుకు వచ్చిన వస్త్రాలతో ఎమ్మెల్యే కాసుని ముస్లిం మత పెద్దలు సన్మానించారు. అనంతరం జలగల బజార్, షాదీఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల కోసం దాచేపల్లిలో రూ.1.50 కోట్లతో షాదీఖానా నిర్మించి ముస్లింల చిరకాల కోరిక నేరవేర్చామన్నారు. రాజకీయంగా, సామాజికంగా ముస్లిం, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించామని, పార్టీ పదవుల్లో కూడా ముస్లింలకు తగిన గుర్తింపు ఇచ్చామని ఆయన చెప్పారు. ముస్లింల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, కుట్రలు, కుతంత్రాలు, మోసాలు చేసే టీడీపీ, జనసేన, బీజేపీలను నమ్మవద్దని ఆయన కోరారు. సంక్షేమాన్ని చేసి చూపించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పార్టీ పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, నాయకులు సయ్యద్ మౌలాలీ, పూలజానీ, షేక్ సైసావలి, షేక్ సైదా, రఫీ, మాబు సుభానీ, సైదావలి, గన్నుబుడే, మున్నా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

మాచర్ల రూరల్: మాచర్ల మండలం అచ్చమ్మకుంట తండా గ్రామానికి చెందిన 40 కుటుంబాలు తెలుగు దేశం పార్టీని వీడి ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. పీఆర్కే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్ పీఆర్కే చేస్తున్న కృషికి ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రమావత్ పెద్దబాబు, సోమ్లా, సక్రియా, గుండాల రంగయ్య, ఈ బాలు, కేతావత్ శాలి, రమావత్ మంగ్లా, రూప్‌సింగ్, మునేంద్ర, మరో 30 కుటుంబాలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రంగానాయక్, గ్రామ పెద్దలు పచ్చిపాల శ్రీను, బాణావత్ లచ్చునాయక్, రమావత్ కెసిన్యానాయక్, మన్యానాయక్, సర్వర్‌నాయక్, పాండ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె. పాపయ్య

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2024 మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ(ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మంచికల్లు, పాలువాయిగేటు గ్రామాలలో పర్యటించి ఎన్నికల ప్రవర్తన నియమాలపై ఆయా కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ మా బృందం 2024 మే 13న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మండలంలోని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. మండల ప్రజలను ప్రశాంతంగా వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలలో భారీగా నగదు, మద్యం, ఇతర వస్తువులు తరలించడం నేరమని గుర్తుంచుకోవాలన్నారు. గ్రామాలలో ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతుంటే భారత ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి–విజిల్ యాప్ ద్వారా సమాచారం ఇచ్చినట్లయితే వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో స్పందిస్తుందన్నారు.



మంచికల్లు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పాపయ్య, సిబ్బంది

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

ప్రభుత్వ విప్ పీఆర్కే



మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరికి నియామక పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు తాను ఎల్లవేళలా అండదండగా ఉంటానని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరిని జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ విప్ పీఆర్కే చౌడేశ్వరికి నియామక పత్రం అందజేసి మాట్లాడారు. చౌడేశ్వరి సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన మండల ప్రజలకు అందజేస్తూ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి అభివృద్ధికి అంకితభావంతో కృషి చేశారన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీలో వారికి సముచితస్థానం కల్పించి వారి సేవలను సద్వినియోగం చేసుకుంటుందన్నారు. పార్టీలో అధిష్టానం తీసుకునే నిర్ణయాలకు ఎవరైనా కచ్చితంగా కట్టుబడి ఉండాలని వారికి తాము ఎప్పుడూ తోడుగా ఉంటామన్నారు. 2024 మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని 5వ సారి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేస్తానని చౌడేశ్వరి అన్నారు. పార్టీలో తనకు కీలకమైన పదవి కేటాయించడానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను కలిసి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, కొమ్మారెడ్డి చలమారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఎన్.భాస్కర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి మండల యూత్ అధ్యక్షులు కె.సతీష్‌రెడ్డి, పార్టీ నాయకులు పోట్ల ముత్తయ్య, తుమ్మా ఇన్నారెడ్డి, ఏరువ విజయ భాస్కర్‌రెడ్డి, పులి ఓబుల్‌రెడ్డి, శీలం అంజయ్య, పి.శ్రీనివాసరెడ్డి, కె.మర్రెడ్డి, డి.బంగారురెడ్డి, బి.తిరుపతిరావు, డి.సంసోన్, డి.నర్సింహారావు తదితరులు న్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో ఆక్స్‌ఫర్డ్ లే అవుట్ అభివృద్ధి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో ఆక్స్‌ఫర్డ్ లే అవుట్ అభివృద్ధి చెందుతుందని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జానపాడు రోడ్డులోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రూ.52 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టబోతున్నామని, ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించటం జరిగిందన్నారు. వచ్చే 18 నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయటం జరుగుతుందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో జానపాడు గ్రామం, ఆక్స్‌ఫర్డ్ లే అవుట్‌లు మరింత అభివృద్ధితో ముందుకు పోతాయని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ లే అవుట్‌లో నివాసం ఉంటున్న ప్రజలు మంచినీటి సమస్య ఉందని తన దృష్టికి తీసుకొచ్చారని, వారి సమస్యను పరిష్కారానికి ఒక ట్యాంకర్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వచ్చే వేసవికి వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి ప్రతి అపార్టుమెంట్‌కు నీరు వచ్చేలా చూడటం జరుగుతుందన్నారు. జానపాడు గ్రామంలో ఏ విధంగా ఇంటింటికి మంచినీటిని అందిస్తున్నామో త్వరలోనే ఆక్స్‌ఫర్డ్ లే అవుట్‌లో ఉన్న ప్రజలకు కూడా నీటిని అందజేస్తామని ఆయన తెలియజేశారు. పంచాయతీ వారితో రీ సర్వే చేయించి భూములు ఆక్రమణకు గురికాకుండా చూడటం జరుగుతుందన్నారు. ఆక్స్‌ఫర్డ్ లే అవుట్‌లో ఉండే ప్రజలకు ఏ వార్డులోకి వస్తారో తెలియలేదని, అది కూడా తెలుసుకొని వారి కోసం ప్రత్యేకంగా ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. త్వరలోనే ఆక్స్‌ఫర్డ్ కాలనీని సందర్శించి డోర్ టూ డోర్ తిరిగి మీ సమస్యలను తెలుసుకోవటం జరుగుతుందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటం కోసం కూడా మీ సహాయ, సహకారాలు అడుగుతామని చెప్పారు.

మాడుగులకు మహర్దశ

- గ్రామంలో అభివృద్ధి పరుగులు
- రూ.40.65 కోట్లతో సంక్షేమం
- అభివృద్ధికి రూ.12.51 కోట్లు
- మట్టిరోడ్లు మాయం... సీసీ రోడ్లు దర్శనం

గురజాల : అత్యంత వెనుకబడిన గురజాల మండలంలోని గ్రామాలు కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందాయి. అభివృద్ధి అంటే ఏంటో తెలియని పల్లె వాసులకు జగనన్న ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలిచి ఒక వైపు సంక్షేమం.. మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనకు విశేషంగా కృషి చేసింది. కాసు మహేష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత మాడుగుల గ్రామానికి మహర్దశ పట్టింది. గ్రామ ముఖచిత్రమే మారిపోయింది. ఇప్పటివరకు సమస్యలతో ఉన్న ప్రజలు ఇప్పుడు సకల సదుపాయాలతో సంతోషంగా ఉన్నారు. కాలనీల్లో రహదారులు, సీసీ డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం.. ఇలా ఒకటి కాదు ఎన్నో రకాల వసుతులు కల్పించారు. పెద్ద ఎత్తున సంక్షేమం అందిస్తూ మరోవైపు కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామ అభివృద్ధికి కాసు మహేష్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు. గతంలో యరపతినేని శ్రీనివాసరావు 10 ఏళ్ల ఎమ్మెల్యేగా పనిచేసినా గ్రామ అభివృద్ధికి ఖర్చు పెట్టలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయని గ్రామస్తులు అంటున్నారు.

మాడుగులలో అభివృద్ధి ఇలా...

- నాడు–నేడు కింద పాఠశాలల్లో 24 పనులకు గాను రూ.1.64 కోట్లు
- 2 గ్రామ వార్డు సచివాలయాలకు రూ.65 లక్షలు
- 18 సీసీ రోడ్లకు రూ.2.45 కోట్లు
- 13 గ్రావెల్ రహదారులకు రూ.25 లక్షలు
- ప్రతి ఇంటికి మంచినీటిని అందించేందుకు జల్‌జీవన్ మిషన్ కింద రూ.3.34 కోట్లు
- 2 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి రూ.43.60 లక్షలు ఇంకా పనులు ప్రారంభం కాలేదు.
- హెల్త్ క్లినిక్ రూ.17.50 లక్షలు ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

సంక్షేమంలో కొన్ని ఇలా...

అమ్మ ఒడి 756 మందికి రూ.3,52 కోట్లు
జగనన్న విద్యాదీవెన 437 మందికి రూ.1.87 కోట్లు
జగనన్న వసతి దీవెన 330 మందికి 57.33 లక్షలు
రైతు భరోసా 1539 మందికి రూ.6.97 కోట్లు
వైఎస్సార్ పెన్షన్ కానుక 1299 మందికి రూ.12.69 కోట్లు
చేయూత 316 మందికి రూ.1.45 కోట్లు
ఆసరా 907 మందికి రూ.1.20 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 364 మందికి రూ.1.43 కోట్లు అందించారు.



మాడుగుల గ్రామంలోని సచివాలయం



మాడుగుల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



జల్‌జీవన్ మిషన్ పథకంలో పైపు లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం



యాదవ బజారులో సీసీ రోడ్డు

పాలనా సౌలభ్యం బాగుంది...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందించడం ఎంతో బాగుంది. గ్రామాల్లోనే అన్ని సేవలు అందేలా చర్యలు చేపట్టడంతో పాలనా సౌలభ్యం బాగుంది. గతంతో పోల్చితే ఈ ప్రభుత్వం ఎంతో మంచి సేవలు అందిస్తుంది. గ్రామం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు కూడా అందుతున్నాయి.
– పేరుపోగు వెంకయ్య, మాడుగుల

గ్రామ అభివృద్ధి జరిగింది...

గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభించింది. మాడుగులలో అభివృద్ధి జరిగింది. సీసీ రోడ్లు, సచివాలయాలు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి సమస్యలకు మోక్షం కలిగింది. అన్ని వీధుల్లో సీసీ రహదారులు ఏర్పాటు చేశారు. కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అన్ని పథకాలు ఇంటికే చేరుతున్నాయి.
– తడిసిన కృపారావు, మాడుగుల

అభివృద్ధే లక్ష్యంగా...

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం జరిగింది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాం. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా పనులు చేపట్టాం. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వేల కోట్ల వెచ్చించి అభివృద్ధికి దోహదపడ్డారు. మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు సాగారు. ప్రతి ఒక్కరం వైఎస్సార్‌సీపీకి రుణపడి ఉంటాం.
– సిద్దాదపు గాంధీ, మండల కన్వీనర్,గురజాల

ఘనంగా మాసశివరాత్రి

నకరికల్లు: మండలంలోని నర్శింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో మాసశివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణమాస మాసశివరాత్రి పురస్కరించుకొని అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ విశేషద్రవ్యములతో స్వామి వారికి అభిషేకాలు చేశారు.

స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మాసశివరాత్రి పురస్కరించుకొని భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించారు. విశేష అలంకరణలో ఉన్న స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



విశేష అలంకణలో నర్శింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారు

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

నకరికల్లు: తెలుగు సంవత్సరాది ఉగాది ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, త్రైత సిద్ధాంత భగవద్గీతను పఠించాలని ప్రబోధ సేవాసమితి ఇందూ /ానవేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు అన్నారు. త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను రచించారన్నారు. ఉగాదిగా పిలువబడే యుగాది అంటే యుగానికి ఆది అని అన్నారు. ఉగాది రోజు ఆరు రుచుల ప్రసాదాన్ని దేవునికి నివేదించి మోక్షానికి దగ్గర చేయమని ప్రార్థిస్తారని తెలిపారు. కమిటీ సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, కె.గోపి, డి.శ్రీను, ఎం.వీరయ్య, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ అనురాధ, టి.రాఘవ, ఎం.అమర్, బి.చిరంజీవి, బి.శివ, వై.రామాంజనేయులు, కె.గంగయ్య పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com